క్లుప్తంగా

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ఈపూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈపూరు మండలంలోని అన్ని గ్రామాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, పందులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు జరుగుతుందని ఈపూరు పశువైద్యశాల ఏడీ డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది టీంలుగా ఏర్పడి గ్రామాల్లో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు పలు గ్రామాల్లో సుమారు 3 వేల పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి అపోహలు లేకుండా తమ పశువులకు టీకాలు వేయించుకొని సిబ్బందికి సహకరించాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఈపూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 6,11వ తరగతి ప్రవేశం కోసం, 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.జ్యోతి సోమవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని 24 కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 6, 11వ తరగతులలో ప్రవేశాలకు, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 27వతేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.శామ్యూల్ సోమవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే ప్రవేశాల కోసం పరిశీలింపబడతాయని స్పష్టం చేశారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. వివరాలకు 9000204930 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

జగనన్న గోరుముద్ద పథకం పరిశీలన

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని గ్రామసర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, ఇన్‌చార్జి సచివాలయ సంక్షేమ విద్యా సహాయకుడు వైఎస్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధీకరణ

శావల్యాపురం: ఇటీవల కురిసిన అకాల వర్షం వలన ఉరుములు, మెరుపులు, పిడుగుపాటుకు మండలంలో పడిపోయిన విద్యుత్ స్తంభాలను తిరిగి పునరుద్ధరించినట్లు ఏఈ సంపెంగుల గాంధీ తెలిపారు. సోమవారం స్థానిక ఉప విద్యుత్ కేంద్రంలో ఏఈ మాట్లాడుతూ చినకంచర్ల, బాస్కర్ నగర్ గ్రామాల్లోని మాగాణి పొలాల్లో ఐదు విద్యుత్ స్తంభాలు పడిపోవటంతో పాటు, పింగాణి యంత్ర పరికరాలు పగలిపోయినట్లు చెప్పారు. దీంతో తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టి విద్యుత్ ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఆయనతో పాటు లైన్ ఇన్‌స్పెక్టరు శివకాంత్, లైన్‌మెన్ వెంకట్రావు ఉన్నారు.

నేడు ప్రజావేదిక కార్యక్రమం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు 15వ విడత ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నీ గ్రామపంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేసినటువంటి పనులు, నిధులు తదితర వాటిపై సామాజిక బృందాలు ఆడిట్ చేసిన వాటిని గ్రామసభలు నిర్వహించామన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

శావల్యాపురం: పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎ.రాజశేఖర్ సోమవారం పరిశీలించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రంలో 268 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు పరీక్షలు సజావుగా జరిగేలా పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర వసతులను స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషనులో ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఆయనతో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరీ, డిపార్టుమెంటల్ అధికారి రామారావులు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆభరణాల వితరణ

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామం బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారికి రూ.లక్ష రూపాయల విలువ చేసే బంగారు నల్లపూసల తాడును చింతా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అందజేశారు.

సమస్యలను పరిష్కరిస్తున్న ఘనత మాదే

గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): గతంలో ఎన్నడూ లేనివిధంగా గడపగడపకు తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని 15వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి దంపతులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సన్మానించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు తాగునీటి సమస్యను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు ట్యాంక్‌ల పేరుతో దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం వినుకొండలో బిందెల సంస్కృతిని రూపుమాపామని, రానున్న రోజుల్లో 24 గంటలు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తుంటే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోర్టుల్లో కేసులు వేసి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్ రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. అభివృద్ధి చేయడం చేతకాని చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం అలజడులు సృష్టించి కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్రపన్నారన్నారు.

కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్‌ఖన్నా, బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షేక్ షకీలా, పాపసాని బ్రహ్మయ్య, గంటా కాలేషా, వైఎస్సార్ సీపీ నాయకులు ములకా రామతులసిరెడ్డి, పీఎస్ ఖాన్, కోపెల దేవరాజ్, యారం రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేసే ఏకైక వ్యక్తి చంద్రబాబు

మీడియాతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: రాజకీయాల్లో డబ్బు తీసుకొని వచ్చి ప్రలోభాలకు గురి చేసే ఏకైక వ్యక్తి నారా చంద్రబాబునాయుడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలతో బేరసారాలు నిర్వహించి తన నీచ రాజకీయాలకు పదును పెట్టి ప్రజాస్వామ్యాన్ని మరోసారి ఖూనీ చేసి పరిహాసం చేసి గెలిచాడన్నారు. సంతలో పశువులను కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశాడన్నారు. దీనిని తమ విజయంగా చంద్రబాబు, ఎల్లో మీడియా డప్పు కొట్టుకోవడం 1995 నుంచి వస్తుందే అన్నారు. గెలిచే బలం లేకున్నా అభ్యర్థిని బరిలో దించి క్రాస్ ఓటింగ్ రాజకీయాలుకు తెరతీశాడని, ఈ అవినీతి అంశాన్ని మొదట్లోనే వైఎస్సార్‌సీపీ వెల్లడించిందన్నారు. గతంలో 23 మంది వైఎస్సార్‌సీపీ శాసన సభ్యులను కోట్ల రూపాయలు పెట్టి పశువులా కొనుగోలు చేసిన పార్టీ టీడీపీ అన్నారు. డబ్బు తీసుకొని ఓటు వేసిన ఎమ్మెల్యేలను ప్రజలు క్షమించరన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికలలో చంద్రబాబుకు బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీ విజయం చేకూరుస్తారన్నారు. దళితులకు ద్రోహం చేసిన బాబుకు వారి చేతిలో భంగపాటు తప్పదన్నారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి ప్రాణహాని ఉంటే అది టీడీపీ నుంచే అన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో వినుకొండ నియోజక వర్గంలో పెద్ద ఎత్తున అమలవుతున్న సంక్షేమ పథకాలకు, జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బొల్లాపల్లి మండలంలోని ఎనిమీది తండా, నూజెండ్ల మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన పలు కుటుంబాల వారు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యుల్లాగా చూసుకుంటామన్నారు. పార్టీలో చేరిన వారిలో నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన నక్కా నాగయ్య, పిల్లి శ్రీను, గుమ్మా అంజయ్య, కుర్రా అచ్చయ్య, కందుల ఈశ్వర్‌రెడ్డి, బొల్లాపల్లి మండలం పలుకూరు పంచాయతీ పరిధిలోని ఎనిమీది తండాకు చెందిన భూక్యా గోపీనాయక్ కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో బొల్లాపల్లి, నూజెండ్ల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి రూ.7.41 లక్షల ఆదాయం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.7,41,461ల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయంలోని హుండీల ద్వారా రూ.5,74,110లు, అన్నదాన హుండీ ద్వారా రూ.1,67,351లు వచ్చినట్టు వివరించారు. హుండీల లెక్కింపును దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు పుణ్యాల వెంకటరెడ్డి, ఆర్.వెంకటేశ్వర రావు పర్యవేక్షించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జల్లి శ్రీనివాస రావు, మాజీ సభ్యు డు ఏలూరి అశోక్, ములకలూరు చైతన్య గోదా వరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ఏఎంజీ విద్యార్థిని ప్రతిభ



చిలకలూరిపేటటౌన్: టాలెంట్ టెస్టులో తమ పాఠశాల విద్యార్థిని నాల్గో ర్యాంకు సాధించటం అభినందనీయమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సీఏవో మాశిలామణి చెప్పారు. సోమవారం ఏఎంజీ ఇండియా ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నూనె లక్ష్మణబాబు జనరల్ నాలెడ్జ్ టెస్టును అనేక ప్రాంతాల్లో నిర్వహించారని, ఈ టెస్టులో తమ పాఠశాల 9 తరగతి విద్యార్థిని కె.త్రివేణి రాష్ట్రస్థాయిలో నాల్గవ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి టాలెంట్ టెస్టు నిర్వాహకులు నూనె లక్ష్మణబాబు చేతుల మీదుల బహుమతి ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం పి.మేరి, కె.కృపాదానం పాల్గొన్నారు.

29న వేల్పూరులో ఆసరా కార్యక్రమం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరులో ఈనెల 29న వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధులు సందర్భంగా మండల స్థాయిలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా ప్రారంభోత్సవం నిర్వహిస్తామని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 706 మహిళా గ్రూపులకు రూ. 5 కోట్ల 51 లక్షలు నగదు మహిళా సభ్యుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు.

చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ అంకారావు, ఎంపీపీ గద్దం బాలనాగమ్మ

శావల్యాపురం: అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన లబ్ధిదారులు అందరు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. సోమవారం శావల్యాపురంలో అంగన్‌వాడీ సెంటరులో పోషణ పక్వాడా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కిషోరు బాలికలు తక్కువ ఖర్చుతో కూడిన చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం పథకంలో రాగిపిండి, జొన్నపిండి, అటుకులు, బెల్లం, చెక్కీలు, కర్జూరాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత లోపించి ఇబ్బందులు పడుతున్నా వారందరు క్రమం తప్పకుండా పోషకాలు కల్గిన మంచి ఆహారాన్ని తీసుకోవటం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమించడానికి అన్నీ శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, మహిళా పోలీసు గౌసియాబేగం, కార్యకర్తలు గోవిందమ్మ, జాస్సికా రాణి, గోపమ్మ, ఈస్తేరీరాణి పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవ వేడుకలు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషణ పక్షోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజులబజారులో గల కల్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు, పచ్చళ్ళు, చిరుధాన్యాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ స్టాల్స్‌ను తహసీల్దార్ జి. అంకారావు, ఎండీవో కె.మాథ్యూబాబు, ఎంపీపీ గద్దం బాలనాగమ్మలు పరిశీలించి అభినందించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన పౌష్టికాహారం గురించి వివరించారు. వారు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవలసిన నివారణ చర్యలు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పోతిరెడ్డి జగన్‌నరసింహారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. శశిదేవి, దేవీభాయి, షమీమ్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

క్రీడలతో మంచి గుర్తింపు

- జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా
- జంగాలపల్లె క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా, నాయకులు

నాదెండ్ల: క్రీడలు మంచి గుర్తింపుతో పాటూ ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు దోహదపడతాయని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. నాదెండ్ల మండలం జంగాలపల్లె గ్రామంలో గత కొద్దిరోజులుగా జరుగుమల్లి ఆదిత్య కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జేపీజే టెన్నిస్ బాల్ క్రికెట్ ఓపెన్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. బహుమతులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జరిగిన పోటీలకు 60 టీంలు పాల్గొన్నాయి. ప్రథమ స్థానాన్ని ఉన్నవ గ్రామానికి చెందిన జట్టు కైవసం చేసుకోగా, రూ.25 వేలు నగదు, షీల్డ్‌లను అందించారు. రెండో బహుమతి జంగాలపల్లె గ్రామానికి చెందిన జట్టు గెలుపొంది, రూ.15 వేలు నగదు, షీల్డ్ అందుకున్నారు. మూడో బహుమతిని నాదెండ్ల గ్రామానికి చెందిన జట్టు సాధించి రూ.7,500లు నగదు, షీల్డ్‌ను అందించారు. ఈ సందర్భంగా జాన్‌సైదా మాట్లాడుతూ, క్రీడలు ప్రతిభకు మెట్లన్నారు. క్రీడలతో విస్తృత పరిచయాలు ఏర్పడి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జరుగుమల్లి ఏసు రత్నం, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, వైసీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోటయ్య స్వామి, బీవీ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అబ్దుల్‌రౌఫ్, ఆదిబాబు, కరిముల్లా, గంట హరికృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత చిన్న మస్తాన్‌రెడ్డి మృతి

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సాగు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కల్లి చిన్న మస్తాన్‌రెడ్డి (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డిలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా రైతులకు చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అదే విధంగా మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి ఆయన కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం గ్రామంలో జరిగిన మస్తాన్‌రెడ్డి అంతిమయాత్రలో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ట్రక్టర్ నడిపి తన అభిమానాన్ని చాటుకున్నారు. కాగా మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్‌లు గెల్లి చినకోటి రెడ్డి, పడాల చక్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చపారపు గోపాలరెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, అన్నెం పున్నారెడ్డి, చల్లా నారపరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, గెల్లి బ్రహ్మారెడ్డి, కోటిరెడ్డి, మేడికొండ శ్రీనివాసరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

దాసుకు ఏపీ జేఏసీ నాయకుల నివాళి



దాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

నరసరావుపేట: గత కరోనా కాలంలో మృతిచెందిన ఆర్టీసీ ఉద్యోగి వేల్పుల దాసు చిత్రపటానికి ఏపీ జేఏసీ అమరావతి పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నాగమల్లేశ్వరరావు, తిరుపతిరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్యవర్గ పిలుపు మేరకు సోమవారం దాసు గృహాన్ని సందర్శించి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాల మంజూరు విషయంలో తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. వీఆర్వో సంఘ జిల్లా కార్యదర్శి రామారావు, ఏపీ జేఏసీ కార్యదర్శి ఎం.కోటేశ్వర రావు, డిపో అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.జాని, సంయుక్త కార్యదర్శి జేఎస్ రావు, జిల్లా ప్రచార కార్యదర్శి టి.రాయల్‌బాబు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం శోభకృత్ నామ సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. గుంటూరురోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఆలయ ఈవో టి.సుధాకర రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జల్లి శ్రీనివాస రావు, మాజీ కమిటీ సభ్యుడు మాలపాటి తిరుపతిరెడ్డి, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, బిల్డర్ నరసింహా రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు దేవస్థానాల్లో కానుకల లెక్కింపు

యడ్లపాడు: మండలంలోని మూడు ఆలయాల్లో దేవాదాయ శాఖ అధికారులు హుండీ లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఈ మూడు ఆలయల హుండీల్లో భక్తులకు సమర్పించిన నాణేలు, కరెన్సీ మొత్తం రూ.1,34,307 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయా ఆలయాలు, కానుల వివరాలు..మండలకేంద్రమైన యడ్లపాడు గ్రామంలోని రణవీరాంజనేయస్వామి దేవస్థానంలో రూ.1,12095, సొలస గ్రామంలోని శ్రీభూ సమేత రంగనాయకస్వామి దేవస్థానంలో రూ.14,421, అలాగే కొండవీడు గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో రూ.7,791 భక్తులు కానుకలు హుండీల్లో వేసినట్లు అధికారులు తెలిపారు. వీటిని దేవాదయశాఖ అధికారులు గ్రామపెద్దల సమక్షంలో నిర్వహించినట్లు ఆలయ ఈవో సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

నాదెండ్ల: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై నలుగురు దాడి చేసిన సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై అవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన పూదోక పోలురాజు కుటుంబానికి సమీప బంధువులైన పూదోక రామారావు కుటుంబానికి పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదిన సాతులూరు గ్రామంలో జరిగిన తిరునాళ్ళలో ఘర్షణ పడ్డారు. 24న గ్రామంలో మరోసారి ఘర్షణకు దిగారు. పోలురాజుపై రామారావు, వెంకటస్వామి, గోపీ, వెంకయ్యలు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశారు.

చిన్నారులకు మంచి విద్యనందించాలి

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో గత నాలుగురోజులుగా జరుగుతున్న బాలల సంరక్షణ అనే కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ప్రిన్సిపల్ ఝాన్సీ వాణి మాట్లాడుతూ, బాలల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చిన్నారులకు మంచి చదువు అందించి వారు జీవితంలో ఉన్నతంగా రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు రేవతి పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

నాదెండ్ల: అప్పాపురం–లింగంగుంట్ల మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది ఈఎంటీ అఖిల్, పైలట్ శ్యామ్ తెలిపిన వివరాల మేరకు అప్పాపురం గ్రామానికి చెందిన షేక్ నాగూర్, పి అలి, షేక్ మస్తాన్‌వలి తమ ద్విచక్రవాహనంపై రాత్రి 9.30 గంటల సమయంలో అప్పాపురం వెళ్తున్నారు. అదేసమయంలో నాదెండ్ల గ్రామానికి చెందిన పవన్ తన ద్విచక్రవాహనంపై స్పిన్నింగ్ మిల్లు వద్దకు వచ్చేసరికి ఇరు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నలుగురూ గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మీరా..! మాపై విమర్శలు చేసేది?

టీడీపీ మైనార్టీ నాయకులను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

నరసరావుపేట: గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క ముస్లింకు కూడా మంత్రి పదవి ఇవ్వని నియంత చంద్రబాబు నాయుడు.. ముస్లిం సమాజాన్ని వెలివేసిన ఆ పార్టీలో ఇంకా మీరు కొనసాగటానికి సిగ్గుగా లేదా.. ఒక్కసారి ఆలోచించాలని టీడీపీకి చెందిన ముస్లిం నాయకులను వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు సూచించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాష, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మహబూబుభాష, గ్రామ, వార్డు నాయకులు షేక్ కరిముల్లా, షేక్ అలీమియా, ముద్దా కరిముల్లా, పాదిలే ఖాజా, షేక్ సున్నీ మాట్లాడారు. ఇటీవల టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు, విమర్శలను ఖండించారు. ముస్లిం ప్రజల సంక్షేమం కోసమే ఏర్పాటు చేయబడ్డ వైఎస్సార్‌సీపీ పైన, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలపై చేస్తున్న విమర్శలు తగదన్నారు. మీ కుటుంబాలు కూడా మా పార్టీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలతో ప్రయోజనం పొందుతున్నాయనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. గతంలో ముస్లిం సోదర కుటుంబాలకు రూ.10వేలు రుణం, సంక్షేమ రూపంలో టీడీపీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ప్రతి ముస్లిం కుటుంబం సంక్షేమ పథకాల పేరుతో లబ్ధి పొందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ నాయకులు ముస్లిం సోదరులని తీసుకెళ్లి కొట్టి వాళ్ళ కుటుంబాల్ని రోడ్డున పడేసినప్పుడు ఏమయ్యారు మీరంతా అని ప్రశ్నించారు. ఆటోనగర్ సమస్య ఇప్పటిది కాదని, గతంలో మీ పార్టీ నాయకులు ఎందుకు చేయ లేకపోయారని ప్రశ్నించారు. ధైర్యంగా చెప్పే దమ్ము మీకుందా? మేము స్థల సేకరణ చేసి ఆటోనగర్‌ను పూర్తి చేయాలని ఉద్దేశంతో ముందుకు పోతున్నామన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిన దందాలు సెటిల్‌మెంట్లు ప్రజలు మర్చిపోలేదన్నారు. అంజుమన్ కాంప్లెక్స్‌కు కోట్ల రూపాయలు తెచ్చామని అబద్ధాలు చెప్పి 70 కుటుంబాలను రోడ్డుపాలు చేసింది టీడీపీ వారే అన్నారు.

భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఈపూరు: మండలంలోని వనికుంట, పెద్దకొండాయపాలెం, చిన్నకొండాయపాలెం గ్రామాల్లో త్రైతసిద్ధాంతం–ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞానవేదికకి చెందిన చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వమించారు. ఈ సందర్భంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రాసిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, చిర్రా వెంకట రామిరెడ్డి, రామాంజనేయులు, వై.చిలకమ్మ, వై. విజయలక్ష్మి, కోటేశ్వరమ్మ, గంగయ్య, వెంకటేశ్వరనాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.